# 29. అనాథ

జనం గుంపుగా మూగి వున్నారు. బాధతో కుములుతూ ఏడ్చే ఒక స్త్రీ కంఠమూ, కఠినంగా ఆజ్ఞాపిస్తూన్న ధోరణిలో వున్న ఒక పురుష కంఠమూ స్పష్టంగా వినిపిస్తున్నాయ్.

కుతూహలంకొద్దీ దగ్గరకు వెళ్ళాను. అప్పటికే ప్రేక్షకులకు విసుగెత్తిం దనుకుంటాను - క్రమంగా ఒక్కరొక్కరే సర్దుకుంటున్నారు. కొత్తవాణ్ణి కనుక, కుతూహలమే నన్నా దృశ్యం దగ్గిరికి ఆకర్షించింది.

పిండారబోసినట్టు వెన్నెల కావటం వలన, ఆ చుట్టుపట్ల ఎలక్ట్రిక్ దీపాలు లేకపోయినా, మనుష్యుల మొహాలు స్పష్టంగా కనిపిస్తున్నయ్. ఆమె నవయవ్వని. మొహంలో పెద్ద నాగరికతైతే కనిపించటం లేదు. పల్లెటూరి రకమై వుంటుంది. మాసిన బట్టలు, దుమ్ముకొట్టుకున్న శరీరం. పెద్ద బాధకు లోనై ఎంతో శ్రమకు గురికావటంవల్లనేమో మొహంలో అలసట కనిపిస్తోంది. ఏడ్చి ఏడ్చి ఐ వుంటుంది- కళ్ళు ఉబికినై, తైల సంస్కారం లేని జుట్టు- చీకట్లో ఐతే జడలదయ్యమని భయపడేవాణ్ణేమో! యీ స్థితిలో కూడా ఆమె అందమైనదనే జ్ఞానం ఏ మాత్రం రసహృదయుడికైనా కలుగుతుంది.

అతను ఒక ఎద్దు మొద్దు స్వరూపం, బలంగానే వున్నాడు. వాడి ధోరణి చూస్తే ఆమెను నడిబజార్లోనే చితకతన్నయినా సరే లోబరుచుకుందామనే నిశ్చయం కనిపిస్తోంది. ఆమె సరిగ్గా మాట్లాడటం లేదు. అది వాడికి అగ్గి మీది గుగ్గిలంలాగు వున్నట్టయింది.

ఆమె జుట్టు పట్టుకొని రెండు బాదాడు; "ఇందాకణ్నుంచీ చెప్పి చూస్తున్నా నీకు తోచటంలా? నా డబ్బంతా పాడుచేశాను. మొదట్లోనే ఏడవలేకపోయావ్? కక్కు- నా డబ్బు కక్కు---" అన్నాడు.

మొదట్లో భార్యాభర్తలేమో అనుకున్నాను కాని ఇప్పుడు అనుమానం కలుగుతోంది. ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూ; "నాకెలా తెలుస్తుందీ! నా దగ్గర డబ్బుంటే నీ సహాయం దేనికీ?" అంటోంది.

"మరి తేరగా దొరుకుతుందా డబ్బు?" అని విసురుగా ఆమె చేతి సంచిని లాగి అందులోని మాసిన గుడ్డల్ని ఒకటొకటిగా కింద విసిరేశాడు. అందులో వాడికి పనికొచ్చే వస్తుసామాగ్రి ఏదీ లేదనుకుంటాను.

'చావు...నీ బోటి దరిద్రపుగొట్టుదాన్ని కొట్టే చేతులుకూడా బొబ్బలెక్కినయ్! ఎద్దు మొద్దు స్వరూపం... అడివిజాతి!" అని, కాండ్రించి ఉమ్మేసి, జనంలోంచి బైటపడ్డాడు.

వాడితోబాటు మరికొంతమంది కూడా విడిపోయారు. సిగరెట్లకని బైలుదేరిన నేనుకూడా పూర్తి వివరాలు తెలుసుకునే కుతూహలం మరిలేక నడక సాగించాను.

కిల్లీ కొట్టు దగ్గర ఒక అరగంట గడిపి వుంటాను. మొదటి ఆట జనం ఇళ్ళకు జేరటం, రెండో ఆట జనం సినిమాలోకి వెళ్ళటం కూడా జరిగే వుంటుంది. మెల్లిగా నేనూ ఇంటితోవ పట్టాను.

ఆ సందు మలుపు దగ్గర ఆమె అలాగే నిలబడి వుంది. రోడ్డు మీద నడిచే కొద్దిజనం ఆమెను గమనించటమేలేదు. ఇందాక ఎలా నిలబడి వుందో, అలాగే శిలాప్రతిమలాగు నిలబడి వుంది. ఆమె బట్టలన్నీ చిందరవందరగా కిందపడి వున్నయ్.

ఇందాక పోయిన నా కుతూహలం తిరిగి తలెత్తింది. ఆమె ఎంతో దీనావస్థలో వుండి వుండాలి. ఏ పనీ చేసుకోలేనంత అచేతనంగా మారేందుకు కారణాన్ని నేను వూహించుకోలేకపొయ్యాను.

"ఏ వూరు?"

ఆమె జవాబు చెప్పలేదు. అలాగే నిలబడి నా మొహంలోకి చూసింది.

"ఏం, మీ యింటికి వెళ్ళలేకపొయ్యావా?"

" ఇక్కడెక్కడ...నైజాం?"

కాందిశీకురాలే ననుకున్నాను.

"మరి ఇక్కడెవరూ లేరా?"

"ఉంటే యీ గతెందుకు పడుతుందీ?"

"మరి ఇక్కడే వుంటే పోలీసులు పట్టుకెళ్తారు."

ఆ మాటలకు అమె మళ్ళీ ఏడుపు సాగించింది. పురుషుడు లోకంలో భరించలేని వాటిల్లో ఆడదాని ఏడుపు మొట్టమొదటిది!

"ఏడవ్వోక...ఏ రైలు స్టేషన్‌కో జేరు..."

"అక్కణ్నుంచే సాయింత్రం వాడు నన్ను పట్టుకొచ్చాడు" నన్ను గుర్తుపట్టిందని గ్రహించాను. కాస్సేపు ఆలోచించాను. దారినపోతూ పలకరించిన పుణ్యానికిగాను యీ సమస్యను నేను భేదించవలసిన అవసరం కలిగింది. చావనిమ్మని నా దారిన పొయ్యేందుకు మనసొప్పలేదు. ఆమెను ఆ స్థితిలో వొదిలి వెళ్ళేందుకు ఏ మాత్రం దయనెరిగిన మానవ హృదయమూ ఒప్పదని నాకు తెలుసు. అందులోనూ ఆ నీచుడి ఇనుప చేతుల కింద నలిగిన ఆమె మీద కళ్లారా చూసిన నాకే ఎంతో జాలి కలిగింది. అప్పుడే తగిన విధంగా ఆ పురుష పశువుకు బుద్ధి చెపుదామనుకొన్నాను. కాని, మిగతా జనంవలెనే వాడి కండపుష్టి చూసి కిక్కురుమనకుండా ఉండిపోవాల్సి వొచ్చింది. ఇక ఇప్పుడు ఆ నిస్సహాయస్థితి లేదు. ఆమె వాలకం కూడా ఏదో సహాయానికై ఎదురుచూస్తూనే వుంది. ఆమె ఎవరైనా, మానవ సహజమైన జాలితో యీ రాత్రికి ఆమెకు ఆశ్రయం ఇచ్చినందువల్ల నాకెంతో మనశ్శాంతి కలిగేట్టు తోచింది. ఆమెను యీ స్థితిలోనే వొదిలివెళ్తే జరిగేది కూడా నాకు తెలుసు. పాపం - ఆమె ఏమైందోనని యీ రాత్రంతా బాధపడతాను. ఇందాకటి నీచుడి తమ్ముడు ఇంకోడు ఆమెను నమ్మించి మోసపుచ్చి ఆమెను ఇంకా హీనస్థితిలో వొదిలిపెడతాడు.

పాపపుణ్యాల సంగతి అటుంచి, జీవితంలో ఒక అనాథకు ఒక్క రాత్రి ఆశ్రయమిచ్చిన ఆత్మతృప్తన్నా నాకు దక్కుతుందనే అభిప్రాయం కలిగింది. లోకంలో మనకు సంబంధంలేని అనేక విషయాల్లో ఎందుకు జోక్యం కలిగించుకుంటున్నామో అంతకన్న ఎక్కువ కారణాల వల్లనే ఆమెకా రాత్రి ఆశ్రయ మిద్దామనే నిశ్చయం నాలో కలిగింది. చూస్తూ చూస్తూ న్యాయాన్ని జరిపించలేకపోయినా అన్యాయాన్ని అరికట్టే అవకాశాన్ని చేతనైనా కూడా వొదులుకునేటంత అజ్ఞానంలో లేనుకదా! ఇక లోకం సంగతి కూడా ఆలోచించవలసి వుంది. ఇంటామె పుట్టింట్లో వుండటంవల్ల ప్రస్తుతం ఏ అభ్యంతరాలూ లేవు. ఎవరైనా చూసేందుకైనా వీల్లేదు. యీ రాత్రి ఆమెను ఇంటికి తీసుకొని వెళ్ళటం తెల్లవారుజామునే వాళ్ళ వూరికి పంపెయ్యటం- అంతకన్న ఇంకేముంది?

"సరే...మా ఇంటికి రా...తెల్లారి వెళ్ళిపోదువుకాని..."

అనుకుంటాను: యీ మాటలే తను వినేందుకు సిద్ధంగా వుందని - ఆమెకు తెలుసేమో! తన ఆ దీనస్థితిలో నాబోటివాడు చప్పున తగిన సహాయం చేయగలడని! నేనెవరో, నా తత్వమేమిటో తనకు ఉపకారినో, అపకారినో కూడా తెలియకుండానే ఆమె చెల్లాచెదురుగా వున్న బట్టల్ని చేతిసంచిలో కుక్కుకొని నా వెంట నడవ నారంభించింది.

ఇంటిలోకి వొచ్చేదాకా ఆమె ఒక్క మాట కూడా మాట్లాడలేదు. లైటు కాంతిలో ఆమె స్థితిని మరింత బాగా అర్థం చేసుకున్నాను. ఆ నీచుడి భుజబలం తాలూకు చిహ్నాలు ఆమె శరీరం మీద కనిపిస్తూనే వున్నాయ్. మొహమంతా వాచిపోయింది. లోకమంటే తెలియని స్థితిలో ఆమె దాన్ని ఎదుర్కోలేక ఎంత దెబ్బకు గురైందో అర్థంచేసుకునేందుకు నాకు ఎక్కువ సేపు పట్టలేదు.

"భోంచేశావా?" అన్నాను.

"ఆఁ. భోజనం వాడు పెట్టించాడు."

"వాడసలెవరూ?...కూర్చో."

ఆమె సందేహించకుండా కుర్చీలో కూర్చుంది.

"ఏమో... స్టేషన్‌లో వుంటే తటస్థపడ్డాడు. టిక్కెట్ డబ్బులు కూడా లేక ఆలోచిస్తూన్న సమయంలో పలకరించి పరిచయం చేసుకున్నాడు. నన్ను మా వాళ్ళ దగ్గరికి పంపిస్తానని తియ్యని మాటలు చెప్పి లాక్కొచ్చాడు. భోజనం పెట్టించి...గదికి రమ్మని బలాత్కరించాడు. బండికి పోతానంటే, యీ రాత్రి తనతో గడపాల్సిందేనంటాడు... చంపుతాడేమోనని భయం వేసింది. గోల చేస్తే నలుగురూ కలిసి నన్ను తప్పిస్తారనుకున్నాను...చివరకు విసుగుపుట్టి వాడే వెళ్ళిపొయ్యాడు!" నా మొహంలోకి చూస్తూ తాను కష్టపడి ఎంతో ఓర్పుతో సంపాయించిన విజయానికిగాను నవ్వింది.

ఎంత అమాయకురాలు! తన మీద ఏ అధికారమూ లేని ఒక పురుషుడి నుంచి తప్పించుకోగలగటాన్ని కూడా అదృష్టాల్లో ఒకటిగా పరిగణిస్తోందంటే అదృష్టదేవత అడుగుజాడల్నయినా జీవితంలో చూసి వుంటుందా అనే అనుమానం కలిగింది. యీమెను ఓదార్చటం ఎంత తేలికో కూడా ఇట్టే గ్రహించాను!

"అసలు యీ వూరెందుకొచ్చావ్?"

"పుట్టింటినుంచి వెళ్తున్నాను. బండి తప్పింది. డబ్బులు పారేసుకున్నాను...ఏం చెయ్యటానికీ తోచని సమయంలో..."

పాపం! యీ పతివ్రతల దేశంలో ఆమె తన పాతివ్రత్యాన్ని నిలబెట్టుకునేందుకు యీ రాత్రి అగ్నిపరీక్షనే ఎదుర్కొంది! చిన్నతనం నుంచీ పెద్దలు, మత గ్రంథాలు, సంఘం ఆమెకు నూరిపోసిన పాతివ్రత్య రసమంతా ఆమె శీలాన్ని కాపాడుకునేట్టు చేయగలిగింది. యీ ఊహతో ఆమె మీద ఎక్కడలేని గౌరవమూ నాకు కలిగిందనుకుంటాను.

"నిద్రవొస్తోందా?" అన్నాను. ఇంకా ప్రశ్నలతో ఆమెను వేధించకూడదనుకొని.

"ఊహుఁ. ఇవాళ స్నానమన్నా చేయలేదు. వొళ్ళంతా కంపరంగా వుంది..." అంది.

"వేడినీళ్ళయితే లేవుకాని, స్నానాల గదిలో చన్నీళ్ళున్నవి...." అన్నాను.

"నేనసలు వేనీళ్ళు పోసుకోను" అంది.

"ఐతే దారి చూపుతానురా" అన్నాను.

ఆమె ఏదో అనుమానంతో వూరుకుంది.

"ఏం?"

"ఆలోచిస్తున్నాను. స్నానం చేశాక బట్టల్లేవు--"

పాతివ్రత్యంతో పాటు శుభ్రత కూడా తెలిసిన మనిషి. పల్లెటూరి పడుచనుకున్నాను కాని, ఆమె మాటల ధోరణీ ఆమె ప్రదర్శించే మంచి అలవాట్లూ చూస్తే, బాగా సంస్కారమున్న కుటుంబంలోంచే వొచ్చిందనే నమ్మకం కలిగింది. ఇక ఆమె ప్రస్తుత సమస్య తీరేందుకు ఎక్కువ ఆలోచన అనవసరం. మా ఆవిడ తాలూకు ఇస్త్రీ చీరా, బాడీ, జాకెట్ ఇచ్చాను.

"ఎంత మంచివారండీ?" అంది, నా వెనకాల స్నానాల గదికి నడుస్తూ.

అన్నాళ్ళూ నే గ్రహించని నా మంచితనం, నాకు తెలియకుండానే నా హృదయంలో పావుశతాబ్దంగా పెరిగిన జాలి, దయ, సహృదయత్వం, విశాలదృక్పథం, పరోపకార బుద్ధి... ఇలాటి లక్ష సద్గుణాల ఉనికిని యీమె నా కిప్పుడే వెతికి చూపించింది. దాంతో నేను ఎవరెస్ట్ శిఖరానికి పాకాను. ఎన్నడూ లేనంత గర్వం కలిగింది.

"ఇప్పుడే వొస్తాను--" అన్నాను.

"ఎక్కడికి వెళ్తారు?"

ఫలానా చోటికని ఆమెకు చెప్పలేదు- అభ్యంతరపెడుతుందేమోనని!

"పది నిమిషాల్లో వొస్తాగా...నీకేం భయంలేదు" అని బైట పడ్డాను.

బహుశా నాకు చెప్పేందుకు ఆమె సిగ్గుపడి వుండాలి. ఆమెకు నిజంగా ఆకలి లేకుండా వుంటుందా? ఆ స్థితిలో వాడు ఆమెకు భోజనం పెట్టించినా సరిగా సయించి వుండదు. అతిథి సత్కారంలో లోపం జరిగితే నా మంచితనానికి ఎంత దెబ్బో వూహించగలను. యీ సమయంలో భోజనమైతే దొరకదు కాని, ఏ మిఠాయో, పళ్ళో దొరుకుతవి.

అరగంటలో ఒక రిక్షాలో యీ సరంజామా అంతా ఇంటికి చేర్చాను. అప్పటికే ఆమె స్నానంచేసి ఇస్త్రీ బట్టలు ధరించింది. ఆమెకీ యిల్లు కొత్తయినా ఏది ఎక్కడ వుందో ఇట్టే పట్టుకో గలిగింది. ఎందుకనంటే తలనూనె రాచుకొని, తలంతా చిక్కుతీసుకొని జడ అల్లుకోవటమే గాక స్నో రాచుకొని పౌడర్ కూడా అద్దుకుంది! ఆడదాని దాపరికాలు ఇంకో ఆడదానికి మాత్రం దాపరికం కాదు కాబోలు!

ఇందాక నేను సందుమలుపు నుంచి తీసుకొచ్చినామె- యీమేనా అనిపించింది! ఎంత నాజూగ్గా, ఎంత ఆనందంగా, చిరునవ్వుతో కళకళ్ళాడుతోంది! జీవితంలో బాధే ఎరగదేమోనన్నట్టుంది. వాతావరణం మనిషిలో ఎంత మార్పును తేగలదో ఇట్టే అర్థమైంది. నా కృషి చప్పున ఫలించినందుకు కొత్త రకం గర్వం కలిగింది.

"ఏమిటవన్నీ?" అంది, నాకు ఎదురొచ్చి, నా చేతుల్లోని వస్తు సామాగ్రిని అందుకుంటూ.

"ఏం లేదు...ఆకలి తీరేందుకు!"

"ఎందుకు...ఇన్నా? డబ్బిలా దండగపెడతారెందుకూ?"

ఎంత కలుపుగోలుతనం! ఆ కంఠంలో చిన్నపిల్లవాడి తప్పును సౌమ్యంగా విమర్శించి, ఆజ్ఞాపించే ధోరణి వున్నప్పటికీ ఇలాటి స్త్రీ ఎవరికి భార్యగా వుంటుందో అతన్ని అన్నివిధాలా సుఖపెట్టి మంచి మార్గాన నడపగలదని నా బుర్రలో తోచింది.

"రా. అవన్నీ తిను" అన్నాను.

"నేనూ మనిషినే...మీరూ రండి."

"నేను భోంచేశాను."

"ఐతే నాకు అక్కర్లేదు" అని కోపాన్ని నటిస్తూ బుంగమూతి పెట్టి, ఓరకంట నన్ను కనిపెడుతోంది.

"ముందు నువ్వు కానీ" అన్నాను కొంత సళ్లీస్తూ.

"ఊహూఁ, ముందు మీరే--"

మొగవాళ్ళ ఆధిక్యత యీ అమాయక స్త్రీలు ఎలా చలామణి చేస్తారో తెలిసొచ్చింది. ఇక తప్పనిసరై నేనూ తినుబండారాల మీద పడ్డాను. ఎంతో సున్నితంగా నేర్పుగా నా చేత ఆకలి లేకపోయినా ఆ తినుబండారాల్ని తినిపిస్తూ మాటలు చెప్పనారంభించింది.

"మీ ఆవిడ చాలా లావనుకుంటాను" అంది.

"నీ కెలా తెలుసూ?"

"యీ జాకెట్ చూడండి. నాకెంత వొదులుగా వుందో" వేళ్ళాడే జాకెట్ చేతుల్ని పైకి లాగి చూపించింది. ఆమె తెలివికి లోలోన ఎంతో మెచ్చుకున్నాను. ఇంత సూక్ష్మగ్రాహి కనుకనే తెలివిగా వాడి ఇనుప చేతుల్నుంచి దూసుకో గలిగింది.

ఆమె ముఖంలో కనిపించే ఆనందం పెద్ద ప్రమాదం నుంచి తప్పుకొని 'ప్రమాదం' అనే మాట కూడా వినరాని స్థలానికి చేరిన మనోతృప్తి, ఆమె కోల్పోయిన శక్తులన్నిటినీ తిరిగి కూర్చే అవకాశాన్ని కల్పించినవి.

ఇంతకుముందు ఆమె దీనావస్థ నాలో కలిగించిన జాలి క్రమంగా మాయం కాసాగింది. ఆమె వైఖరి నా జాలిని కోరగలిగిన స్థితిలో మరిలేదు! ఇప్పుడు యీ

అందాల బరిణె మీద మనస్సు కొత్త కోర్కెల్ని ప్రసరించసాగింది. దానికి ఆమె నా మొహంలోకి చూసి 'ఛాలెంజ్' గా కవ్వించే లుక్కులూ, నోరు తెరచి చెప్పకపోయినా చెప్పినదానికన్న ఎంతో త్వరగా నిశితంగా పురుషునికి అర్థమయే ఆమె కోర్కెలు ఎలక్ట్రిక్ లైటు కాంతికి కొత్తవెలుగును కలిగిస్తూ మెరిసే ఆమె కళ్ళలోంచి కనిపించే ఆమె హృదయపు లోతులూ - ఇలాటివెన్నో నన్ను రెచ్చగొట్టినవి.

కాని వెంటనే నిలవతొక్కుకున్నాను. దేన్నయితే నేను విమర్శించి నిరసించి కేవలం న్యాయరక్షణార్థం యీ ఉపకారాన్ని తలపెట్టానో అదంతా నా యీ విషపు కోర్కెతో తారుమారై అపకారమే జరుగుతుంది. వాడు- ఆ రాక్షసుడికీ నాకూ దుస్తుల్లో తప్ప ఇంకో భేదమే వుండదు! అదీగాక ఆమె పాతివ్రత్యాన్ని కళ్ళారా చూచిన నేను సహజంగా పురుషుడు పడే గోతిలోనే పడి ఆమెచేత నిరసించబడి, యీ రాత్రే గాకుండా అనేక రాత్రులు ఆ బాధతో కుళ్ళవలసి వుంటుందని కూడా నాకు తెలియకపోలేదు. అందుకనే ఆ తాత్కాలికోద్రేకాన్ని వెంటనే తొక్కిపట్టుకోగలిగాను.

"ఏమండీ! మాట్లాడకుండా వూరుకున్నారు? నా మీద కోపమా?" అంది.

ఇంత సున్నితంగా అడిగే ఆడప్రాణే వుంటే పురుషుడికి కష్టాలనేవే కనిపించవుకదా! యీమె ధోరణి చూస్తుంటే నేనెంత తొందరపడి నా భార్యను వివాహమాడానో, ఇలాటి ఒక్క స్త్రీతో అనేక జన్మలవరకూ జీవితం ఎంత హాయిగా గడపవచ్చో అర్థమైంది. ఈమె చాకచక్యం, కోమలత్వం, అందం, మాటలతీరు, లోకంలో సౌఖ్యమనేది తాను అందుకొని పక్క వ్యక్తికి అందివ్వగల సామర్థ్యత - ఒకటేమిటి, నేను ఎరగని అనేక విషయాలు ఆమె ఎక్కువతనాన్నీ నా భార్య తక్కువతనాన్నీ మరోసారి నిరూపించసాగినవి.

"నాకేం కోపం...? అన్నాను.

"మరి ఏదో ఆలోచిస్తున్నారేం?"

"ఏమీ లేదు...పాపం నీవు ఎంత అవస్థలపాలయ్యావో తలుచుకుంటే..."

"ఇంకా అవస్థేమిటి? హాయిగా వున్నాను. మీరు నన్ను రక్షించకపోతే - యీ పట్టణంలో యీ రాత్రి ఏమయ్యేదాన్నో--?"

"పాపం!"

"పోనిద్దురూ, చెడుకలను గూర్చి ఆలోచించటం వల్ల అది మరింత దుస్వప్నంగానే కనిపిస్తుంది. ఇంకేదన్నా మాటలు చెప్పండి."

"ఏం చెప్పమంటావ్?"

"ఏదో వొకటి...మీకు పిల్లలా?"

"ఉహుం."

"మరి మీ ఆవిడతో రోజూ ఏం మాట్లాడుతారు?"

నిజమే- ఏం మాట్లాడుతానో ఇప్పుడైతే గుర్తు రావటం లేదు; కాని ఐదు సంవత్సరాలుగా యీ కప్పు కింద ప్రతిరాత్రీ ఏం మాట్లాడి గడప గలిగానో ఆలోచించుకుంటే గుండె పగులుతోంది. యీమె చెప్పేదాకా ఆ విషయమే గుర్తుకు రాలేదు. ఎంత తెలివిగలది!

"మీకు నిద్దరొస్తున్నట్టుంది!"

"ఉహుఁ."

"పోనీ నాకు నిద్దరొస్తోంది."

"ఐతే పడుకో...ఆ మంచం మీద."

ఆమె వెళ్ళి పడుకుంది. నేనెక్కడ పడుకునేదా అని ఆలోచిస్తున్నాను.

"మీరెక్కడ పడుకుంటారు?"

"నీ సంగతి చూసుకో."

"నాకు నిద్ర రావటం లేదు...జోల పాడండి."

"నాకు పాటలు రావు."

"పొండి...నాతో ఎగతాళి మాట్లాడుతున్నారు. మీరూ ఇక్కడ పడుకోరాదా?"

నిద్రపోతూన్న అనేక శక్తులు నాలోని నిద్రమత్తును ఇట్టే పారదోలినయ్. ఇంత మంచి పడుచు నుంచి, ఇలాటి మాటలే రావాలి కాని నేనేమిటి- నాకు రెట్టింపు వయసున్న మగవాడు, తన వయస్సును తేలిగ్గా సగం వెనక్కు నెట్టేసుకోగలడు!

నాకు మరే అనుమానాలూ కలగలేదు. యీ రాత్రి ఏ పూర్వపుణ్యానో యీ స్వర్గం లభించింది; ఆ దారి నరకం గుండానే ఐనప్పటికీ, దాన్ని గడిచేం కనుక మరి ఇబ్బందేమీ లేదు. ఆమె నన్ను "డిసప్పాయింట్" చేస్తుందేమో, యీ తద్దినాన్ని కొనితెచ్చుకున్నందుకు బాగా శాస్తయిందని బాధపడాల్సి వుంటుందేమోననే నా బాధలన్నీ మటుమాయమైనవి. తెలివిగలవాణ్ని కనుక, ఆమె హృదయాన్ని ఇట్టే పట్టేసుకొని, కాపలా వేసి కూర్చున్నందుకు అనుకున్నట్టు మంచి ఫలితమే కలిగింది!

ఆమె పక్క మీద కూర్చొని "కాస్త జరగండి రాణిగారూ!" అన్నాను ఆమె మొహంలోకి చూస్తూ.

"అబ్బ అప్పుడే రాణిని చేశారు! కాస్త చోటుపెడితే చాలు యీ మొగాళ్ళు నలిపేస్తారు!"

నేను ఎలా ప్రవర్తిస్తే తనకు బావుంటుందో ఆమె సజెక్ట్ చేసే ధోరణి చాలా ఆదర్శంగా తోచింది!

"కాస్త జరుగుదూ!"

"ఉహు. ఒక్క మనిషికన్నా ఎక్కువ యీ మంచంమీద పట్టరు... తెలిసిందా?" అంది నా బుగ్గగిల్లి నన్ను దగ్గరికి లాక్కుంటూ!

ఏమన్నదో అన్నది- అది నిజమే- ఒక్క మనిషిగానే ఆ రాత్రి గడిపాం.

❋ ❋ ❋

ఉదయం నుంచీ ఎన్నో ఆలోచనలు : ఎంత తమాషా జరిగింది! గత రాత్రి గుంపుమధ్య ఆమె వాడి చేతుల్లో తన్నులు తిన్నప్పుడు - ఇతర ప్రజలవలెనే నేను కూడా వాణ్ని నిందించాను. కాని దూరం ఆలోచిస్తే వాడి స్థితిలో నేనున్నట్టయితే ఆమె కలిగించే 'డిసప్పాయింట్‌మెంట్' కు ఆమెను చంపి కసి తీర్చుకునేవాణ్నేమో? క్షణంలో పురుషుణ్ని రెచ్చగొట్టి కోర్కెల్ని ఆకాశ పథానికి లాక్కువెళ్ళగలిగే ఆమె ప్రవర్తనకు ఏ పురుషుడైనా కుక్కబుద్ధినే ప్రదర్శించవలసి వుంటుందేమో? ఆమె యీ ఆకర్షణను అర్థంచేసుకోలేక ఆమె మీద మొదట్లో జాలి కలిగింది కాని ఇప్పుడు ఆ నిర్భాగ్యుడికి అందని ఆనందాన్ని చూస్తే వాడిమీద జాలి కలుగుతోంది! ఐతే వాడికే ఆ ఆనందం కలిగివుంటే నేను రాత్రి నల్లుల వేటలోనే ఉండేవాణ్ని!

నిద్ర లేచేప్పటికే ఇల్లంతా శుభ్రంగా వూడ్చింది. యీమెలాటి స్త్రీ వుంటే దాసీ ఖర్చు కూడా దండుగే! నేను పోయి కాఫీ, ఫలహారాలు తీసుకొచ్చాను.

"వంట చేయనా?" అందామె.

"వొద్దులే...కారియర్ వొస్తుంది."

ఆమె మాట్లాడలేదు. రాత్రి నిద్రలేమికి సేద దీర్చుకునేందుకు పడక వేశాను. ఆమె నా కాళ్ళు పిసగనారంభించింది! యీమె భర్త ధన్యుడని రాత్రే గ్రహించాను కాని నేను గ్రహించినదానికన్న అదృష్టవంతుడే ననిపించింది.

"మీ వూరు వెళ్తావా" అంటే - వెళ్తానంటుందేమోనని భయపడి వేరే మాటల్తో సినిమాల్తో షికార్లతో కాలం గడపనారంభించాను. ఒక్కసారే వారానికి సెలవు రాసిపారేసి ఆమెతోనే గడిపాను. యీ వారంలోనూ ఆమె నా పురుషత్వపు అంతును కనుక్కుంది.

ఇక నాకు విసుగెత్తింది. ఎంత తీపయినా మొహం మొత్తకపోదుగా! ఎలాగైనా యీమెను ఇక్కణ్నుంచి పంపెయ్యాలి.

"మీ వూరు వెళ్ళవ్?" అన్నాను.

"పోనిద్దురూ- ఇక్కడే బాగుంది."

ఆమెకు బాగుండలేదనా నా ఏడుపు!

"అది కాదు...నీ కాపరం...?"

"ఇక్కడ సాగుతూనే వుందిగా!"

"నీ భర్త --"

"ఇంకేం భర్త? ఇప్పుడు వెళ్తే ఆయన వూరుకుంటాడా? వెళ్ళగొట్టడూ?"

పెద్ద ప్రమాదమే వొచ్చింది! ఆమె వెళ్ళనంటున్నకొద్దీ నా గుండెల్లోని రాయి బరువుతోపాటు గట్టిదనాన్ని కూడా పుంజుకోనారంభించింది.

"విను: ఇంకా రెండు రోజుల్లో మా ఆవిడ వొస్తుంది. ఆ మూల చీపురుకట్ట వుంది చూశావా--?"

ఆమె ఏడ్వనారంభించింది. మళ్ళీ ఆమె మీద జాలి గలుగుతోంది. కాని ఆమెను మాత్రం ఏదోవిధంగా వొదిలించుకోక తప్పదు. అందులోనూ కాస్త బాహాటంగా యీమెతో తిరిగి నా సంస్కారాన్ని యీ వారం రోజుల్నుంచీ వెళ్ళబోసుకున్న నేరానికి వీధిలో గుసగుసలు బయలుదేరినవి. మా ఆవిడకు యీ వార్తను జేరేసేందుకు తామంతా సిద్ధంగా వున్నట్టే యిరుగు పొరుగుల ఆతృతకూడా నాకు అర్థమైంది! యీ పరిస్థితుల్లో యీమెను యిక్కడ కాదు కదా - యీ వూళ్ళోనే వుండనీయటం నాకు ఏమాత్రమూ శ్రేయస్కరం కాదు!

"వుంటే మా ఆవిడ వూరుకోదు--"

"వెళ్తే మా ఆయన వూరుకోడు!"

ఆ 'ఆయన' గాడు దీనికోసం వెతుక్కుంటూ ఇక్కడికి వొచ్చినా బాగుండు! ఏదో ఉషారుకని వారం గడిపాను కాని, యీ పతివ్రతామతల్లిని - అంటించుకోవటంకన్న వొదిలించుకోవటం పెద్ద సమస్యని ముందు తెలుస్తే యీ ప్రమాదంలో పడేవాణ్నే కాదు! నాడు - ఆమెను ఆ రాత్రి చావబాదినవాడే అదృష్టవంతుడు! నాకు పట్టుకున్నట్టే వాడికీ తుమ్మబంకల్లే అంటుకునేది! వాడి మీద చూపిన దయ, యీమె నా మీద చూపుతే ధన్యుణ్ణే!

కోపం వొస్తోంది కాని, కోప్పడితే ఇంకా పెద్దగా ఏడ్చి ఇరుగు పొరుగుల్ని ఇక్కడికి జేర్పించి, పంచాయితీ లేవదీస్తుందేమోననే భయం కలిగింది. ఇంత లావు పురుషుణ్నీ ఆడదాని ఏడుపుతో జావజావగా మారిపొయ్యాను.

చాలాసేపు బతిమాలాను.

"పోనీ నన్ను వేరే వుంచండి, మీ సేవ చేసుకొని బతుకుతాను!"

ఈమె సేవను భరించగల స్థితిమంతుణ్ణికాదు. అదీగాక ఆమె సేవలో నేను బతకాల్సిన కాలం సగమౌతుంది- ఆమె యీ ఏడు రాత్రుల్లోనూ - మూడు నెల్ల అనుభవాన్నివ్వటమే దానికి ప్రబల తార్కాణం!

"అదంతా చాలా యాతన. చప్పున ఇల్లు దొరకదు... యీ సారి నువ్వు ఇక్కడికి వొచ్చినప్పుడు ఆలోచిద్దాం."

"మా ఆయన రానిస్తాడా?"

బతికించాడు! ఒకడి భార్య ఇంకొకడికి భారం కాకుండా ఆ మాత్రం తొక్కిపట్టకపోతే – నాయనా! యీ సంఘంలో హెచ్చుమీరి ఇతర పురుషుల వెంటపడే యీమెలాటి ఆడవాళ్ళ ధాటికి నాలాటి పురుషులు శంకరగిరి మాన్యాల్ని వెతుక్కోవల్సిందే! ఆ మాత్రం సహాయమే 'ఆయన' చేస్తే ఎప్పటికైనా ఆయనకొక సన్మానం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తాను!

"ఆఁ. ఏదో వంకతో రావొచ్చు. ఆడవాళ్ళకి మార్గాలే తోచవా? అందులోనూ ఇంత తెలివిగలదానివి... నా మీద ప్రేమ వుండాలే కాని నువ్వు రాలేకపోవటమేమిటి?"

యీ మాటలు అన్నానే కాని, గుండెల్లో బితుకుబితుకుమంటూనే వుంది. నా మీది ప్రేమతోనే ఆమె ఇక్కణ్ణుంచి కదలనంటోంది. ఆ ప్రేమకు వొక్క సలాంకొట్టి వొదిలించుకొనే మార్గం కోసమే యీ మాటలు అడ్డంవేశాను. అన్నానుకదానని ఇప్పటికి వొదిలి మళ్ళీ వారానికల్లా యీ ఇల్లు వెతుక్కుంటూ వొస్తుందేమోననే అనుమానం లేకపోలేదు. అందుకనే నాలుగైదు రోజుల్లో ఇల్లు మార్చుకోవాల్సిన అవసరం కూడా లేకపోలేదు! లేకుంటే ఆమె నాకు రావణుడికి మేరుపర్వతం సామెతగా తయారవుతుంది:

"మా ఆయన సంగతి మీకు తెలియదు" అంది మళ్ళీ ఏడుస్తూ.

ఆయన సంగతే నాకు తెలుస్తే ఆయన్నే పిలుచుకొచ్చి యీ పీర్ల గుండం నుంచి బైటపడేవాణ్ణి: మహానుభావుడు క్షేమంగా లేకుంటే మళ్ళీ నా ఖర్మం కాలిందన్నమాటే!

"వూరికే ఏడిస్తే ఎట్లా? మీ వూరిదాకా వొచ్చి దిగపెట్టమంటావ్? చూడు: మీ ఆయనతో చెప్పనా – దారిలో నీకు ఇబ్బంది కలిగిందని..."

"మీ ఇంట్లో చీపురుకట్ట వుంటే మా ఆయన దగ్గర దుడ్డుకర్ర వుంది."

కనుకనే ఆమె మళ్ళీ ఈ ప్రాంతాలకు రాకుండా విధి నన్ను ఆయన దుడ్డుకర్ర రూపంలో కాపాడుతుందని ధైర్యం. "మరేం చేద్దాం!"

"ఆయన వూరుకుంటాడా?... అందులోనూ రెండొందల రూపాయల సంచి పోయిందంటే, ఇంట్లోంచి తరిమేస్తాడు! ...ఏ నుయ్యో, గొయ్యో గతవుతుంది!"

తరువాత ఆమెకు ఏది గతైనా ఇప్పటి నా గతి నుయ్యికన్నా గొయ్యికన్నా ఘోరంగానే వుంది. ఆమె అన్న మాటల్లో నాకు కాస్త ఆశ కనిపించింది. ఆ రెండొందలూ నేనే యిస్తే ఆమె ఎలాగో తన అవస్థ తానుపడి భర్తకు నచ్చజెప్పుకుంటుందేమో?

"రెండొందలూ నేనిస్తాను కాని..."

"ఇచ్చినా--?"

"ఆ సంచీ కూడా కొనిస్తాను..."

చాలాసేపు బతిమాలి చివరకు వాళ్ళ వూరు వెళ్ళేందుకు ఆమెను వొప్పించేప్పటికి నా తలప్రాణం తోకకొచ్చింది.

మర్నాడు రెండొందలూ సమర్పించుకొని ఆమెను సాగనంపేందుకు స్టేషన్‌కు వెళ్ళాను. ప్లాట్‌ఫారం చివర ఆమె కంటతడి బెట్టింది.

"నన్ను మరిచిపోతారా? అంది.

ఇంత అవస్థపడ్డ నేను ఆమెను మరిచిపోతానా? "ఎలా మరిచిపోతాను? నువ్వు నిజంగా దేవతవు!"

వెధవ బండి ఇంకా రాదేం? ఎరిగినవాళ్ళు ఓరచూపులు చూస్తున్నారు. నేనేదో వాళ్ళకు అందనిది కట్టుకుబోతున్నానని. "మళ్ళీ పది రోజుల్లో వస్తాను. ఇల్లు తీసుకోండి."

యీ ఇళ్ళ కరువులో ఎలాగూ ఇల్లు మాట్లాడుకోవాల్సిన రాత నా మొహాన రాసేవుంది.

"ఏం?"

"ఆc. అట్లాగే. నువ్వు తప్పకుండా రావాలి సుమా!"

"నిజమండీ!"

ఇంతలో బండి వొచ్చింది.

"ఇంక నేను వెళ్ళేదా?" అన్నాను ఆమెను బండిలో ఎక్కించి.

"సరే వెళ్ళండి" అంది. బండి కదిలేదాకా గంటసేపు తనకు కాపలా వుండమంటుందేమోనని భయపడ్డాను. రక్షించింది – బతికి బైటపడ్డాను.

❋ ❋ ❋

ఆ రాత్రి 8 గం. కు మేనేజరు ఇంటినుంచి కాల్వ వొడ్డునే తిరిగి వొస్తున్నాను. జనం గుంపుగా జేరి వుండటాన్ని గ్రహించాను. లోపలికి జొరబడదామా అని ఆలోచిస్తుండగా స్త్రీ రోదన కంఠం వినిపించింది... ఇలా చూద్దును ఆమె! ఏడు రాత్రుల క్రితం నేను ఏ దృశ్యాన్నయితే చూశానో అదే దుశ్శాసనుడూ, ద్రౌపదీ దృశ్యం! ఆ వ్యక్తులే! ఆమె చేతిలో ఆ సంచియే! ఆమె నన్ను గుర్తుపడుతుందేమోననే భయంతో అదే ఉరకటం! మళ్ళీ యీ ప్రేక్షకుల్లో ఎవడికో రెండొందల రూపాయిలు (రేటు పెరగకుండా వుంటే) ఖరాబ్ పట్టినయ్. బతికాను! యీ ఇళ్ళ కరువులో, ఇల్లు మార్చాల్సిన అవసరం మరిలేదు!

– *ఏప్రిల్, 1950*